సాయంకాలం ఆరు కావస్తోంది. అందరూ బుద్ధేశ్వర రావుకోసం ఎదురుచూస్తున్నారు. బుద్ధేశ్వరరావు వచ్చాడు కాస్సేపు ఎవరూ మాట్లాడలేదు. అతనూ మాట్లాడలేదు.

"ఏరా, మరీ నరసమ్మనుతీసుకురావద్దూ! మళ్ళీ ఏడింటికి వర్జంట, అన్నాడు కక్కయ్య.

బుద్ధేశ్వరరావు మాట్లాడలేదు.

"ఏం జరిగిందిరా! అట్లాచూస్తావ్" అన్నది పిన్ని...

"నా ఉద్యోగం పోయింది. పదిహేనురోజులు వరసగా నేను ఆఫీసులో సరిగా హాజరు ఉండటంలేదని నన్ను తీసేశారు." అన్నాడు బుద్ధేశ్వరరావు...

# కు ల ద్వే ష ం

"ఏమండీ! నిజంగాచెప్పండి, మీరింత విశాల హృదయం ఉన్నట్లు మాట్లాడతారుగద, మీలో నిజంగా కులాభిమానంలేదా?" అన్నది దమయంతి, నాలో ఏమూలో కులాభిమానం ఉన్నదని ఒప్పుకుంటానన్న విశ్వాసమూ, తాను కేవలం నాచేత ఒప్పించటానికే ఆ ప్రశ్న వేసిందన్న సూచనా ఆమె గొంతులో ధ్వనించింది.

"నేనావిషయం లోతుగా ఆలోచించలేదు. నాకు తెలీకుండా అది ఎన్నడూ బయటపడలేదు. అట్లా బయటపడిఉంటే నేను వెంటనే తెలుసుకునేవాడినే" అన్నాను.

"కోస్తున్నారు. అందరిలోనూ కులాభిమానం ఉంటుంది. ఇతర కులాలమీద ఈర్ష్యకూడా ఉంటుంది," అన్నదామె.

"అది ఉన్నదీ లేనిదీ ఎట్లా తెలుస్తుందో నాకు తెలియబరిస్తేనా నన్ను నేను పరీక్షించుకుంటా," అన్నాను.

దమయంతి కాస్సేపు యోచించి, "మీ కులాన్ని ఎవరన్నా తిడితే మీరూరుకుంటారా?" అన్నది.

"కులాభిమానంగల మా వాళ్ళను నేనే తిడతానే!" అన్నాను.

"అదీ కులాభిమానమే!" అన్నది దమయంతి విజయంతో ఆనందిస్తూ.

"ఎట్లా?" అన్నాను కొద్దిగా నిర్ఘాంతపోయి.

"మీ కులంవాళ్ళను మరెవరూ తిట్టకుండా ముందే మీరు తిట్టేస్తారు. అదే ఇతరులు తిడుతుంటే సంతోషిస్తారా"

"సంతోషించను. నాకు కుల విద్వేషాలలోనూ నమ్మకంలేదు. నా కులాన్ని నేను తిట్టుకోనటం కులద్వేషం కాదుగా!"

దమయంతి కాస్సేపు ఆలోచించి, "నన్ను మాటల్తో బురిడీ కొట్టించేస్తున్నారు. కాని నేనన్నది నిజమని నాకు తెలుసు," అన్నది.

"నేనేమీ నిన్ను బురిడీ కొట్టించటంలేదు. నేనేమన్నా అనుకుంటానని నువ్వు నా ఎదట బ్రాహ్మల్ని తిట్టడం మానకు" అన్నాను.

"నే నటువంటిదాన్ని కాదండో. పనిపెట్టుకుని మీ ఎదటి బ్రాహ్మల్ని తిట్టకపోతే జరగదా! మీ కెందుకు వృథాగా బాధకలిగించాలి. నాకు బ్రాహ్మలంటే కోపం ఉండొచ్చుగాని మీరంటే లేదుగా" అన్నది.

"నాకు కష్టంలేదనే చెబుతున్నా."

"ఇందాక ఉందని ఒప్పుకున్నారే! కులద్వేషం ఇష్టం లేదన్నారుగా"

"ఒకపాయింటు గెలుచుకున్నావు. కాని నేను ఉన్న విషయం సరిగా చెప్పలేదు. నాకు కులద్వేషంలేద. నీకంటే నా కభ్యంతరంలేదు తెలిసిందా!" అన్నాను.

"ఎందుకూ! మీరు ఎక్కువ కులంగనకా!" దమయంతి దొంగను పట్టినట్లు కిలకిలా నవ్వింది.

"కాదు" అన్నాను. కాని చాలాసేపు దమయంతి నన్ను మాట్లాడనివ్వకుండా నవ్వసాగింది. మిగిలిన కులాలన్నీ తక్కువకులాలనుకోవటంచేత బ్రాహ్మలకి ఆ కులాలను ద్వేషించేహక్కుపోయింది-నైతికంగా బ్రాహ్మల్ని ద్వేషించే హక్కు మాకున్నది. కాలక్రమాన బ్రాహ్మల్ని ద్వేషించాలిసిన అవసరంకూడా దాటిపోతుంది. ఇప్పటికే బ్రాహ్మల ప్రభావం చాలా అణగారిపోయింది. ఇంకా అంతో యింతో వుంటే అది మీవాళ్ళు వుండనిస్తున్నదేగాని మావాళ్ళ ప్రయోజకత్వం అందులో యేమీ లేదు' అన్నాను.

"అదీ నిజమేలెండి" అన్నది దమయంతి గంభీరంగా.

"నాకల్లా కోపం దేనికంటే యీ మహాపట్టణంలో ప చుసి మనం యెవరిజీవితాలు వాళ్ళు వెళ్ళబుచ్చుకుంటూ

ఒకరి కులాలనుగురించి ఒకరు యిట్లా జ్ఞాపకంచేసుకోవటం దేనికా అని''అన్నాను.

''నవ్వులకేవో మాటవరసగా అంటే దానికన్నాశా అంత కోపం తెచ్చుకోవాలిటండీ!'' అన్నది దమయంతి.

''నే నిప్పు డామాట కోపంవచ్చినట్టే అన్నానా!'' అన్నాను.

''దాందుంపతెగ మీకు కోపంవస్తే కనుక్కోలేనా! అన్నది దమయంతి.

నన్ను కాచి వడబోశానని దమయంతి విశ్వాసం. నే నామెను యేడాదినుంచీ యెరుగుదును. వాళ్ళద్దెకు తీసుకున్న యింట్లోనే నే నొక గది తీసుకుని వుంటున్నాను. దమయంతి అన్న ఇంజనీరు. అతన్ని యెరిగున్న నా స్నేహితు డొకడు మధ్య సంధానకర్తగా వుండి వాళ్ళభాగంలో నా కా గది యిప్పించాడు. ఇల్లుగలవాళ్ళది పొరుగూరు. అందుచేత బాడుగలో బాడుగని పేచీ పెట్టలేదు.

దమయంతి కింకా పెళ్ళికాలేదు. ఆమె కాలేజీలో చదువుకుంటున్నది. పెళ్ళివిషయం తాపత్రయం వున్నట్టు లేదు. మొట్టమొదట ఇంజనీరుగారే నాతో అంతో యింతో మాట్లాడేవారు. ఇంట్లో యింకా ఆడవాళ్లున్నారనిమాత్రమే నాకు తెలుసునుగాని వాళ్ళెవరోకూడా నాకు తెలీను. నేను వివరాలు తెలుసుకోలేదుకూడాను. ఇంజనీరుగారి భార్య, తల్లి, చెల్లెలు దమయంతి, ఇద్దరాడపిల్లలు వున్నారు. ఈ దమయంతిని చూసి చాలారోజులు ఇంజనీరు భార్యా అను

కనాన్న. (ఆయనభార్య చాలా ఘోషాగా వుంటుంది. ఎన్నడూ మధ్యహాలులోకైనా రాదు.)

దమయంతి యేవేవో సంబంధాలు పోగుచేసి నాతో పరిచయం ఆరంభించకపోతే నేను ఆమె మొహంకూడా యెరగకుండా గడుపుకుపోయి వుండేవాణ్ణి. ఆమె క్లాసుమేటు మేనమామ యెవరో నాకు స్నేహితుట్ట. ఆ మేనమామపేరు దమయంతి తెలుసుకోలేదు. తెలుసుకుని మరచిపోయిందో గాని నాకు చెప్పలేకపోయింది. అదొక సంబంధం కలిపింది. ఇంజనీరుగారి ఆఫీసులో పనిచేసే యింకొక పెద్దమనిషికూతురు నేను రాసిన రెండు పుస్తకాలు చదివి నేను బాగ రాస్తానని చెప్పిందట. అదొక సంబంధం.

అసలు సంగతేమంటే దమయంతికి బైట ప్రపంచంలేదు. కాలేజీ, ఇల్లూ, చదువూ, ఎప్పుడన్నా పుస్తకాలూనూ. స్నేహితురాళ్ళ యిళ్ళకు పోదు. వాళ్ళను తన యింటికి రప్పించదు. కాలక్షేపానికి యింట్లో రేడియోవుంది. ఎప్పుడన్నా పదినిమిషాలు కాలక్షేపం జరగాలంటే నేను దొరికాను. మొదటిలో నిమిషంపైన నిలబడి మాటలాడేదకాదు. కొద్ది వారాలకు నాకు ప్రమోషను వచ్చింది. ఐదు పదినిమిషాలు తమ హాలులో కూచోబెట్టి మాటలాడేది. ఆ తరువాత తాను ప్రమోషను పుచ్చుకుని యెప్పుడుబడితే అప్పుడు—తనకు విశ్రాంతి కలిగినప్పుడల్లా—నా పని చెడగొట్టికూడా నన్ను బాతాఖానీలోకి దింపే అధికారం పుచ్చుకుంది

త్వరలోనే మా ఇద్దరిదీ ఒకవిధమైన ఆదర్శస్నేహంగా పరిణమించింది. అంటే మరేమీలేదు. మేము ఒకరినొకరు

అపార్థం చేసుకోకుండా ఒకరి మనశ్శాంతిని ఒకరు పాడుచేసుకుండా ఎంత సన్నిహితంగా రావచ్చో ఒకరిదగ్గిర ఒకరు ఎంత చనువు తీసుకోవచ్చో కొలిచినట్టుగా నిర్ణయించుకుని ఆ పాకంలో ఆ స్నేహాన్ని సీలుచేసేశాం. ఆమె చదువులో ఎప్పుడన్నా నేను తోడుపడేవాణ్ణి. శెలవురోజు నేను బయటికి వెళ్ళటానికి బద్ధకిస్తే ఆమె నాకింత కాఫీ ఇచ్చుకునేది. ఆమెకుగల కొంతపాటి అందాన్ని నేనుగాని, నాకుగల కొంతపాటి రచనా సామర్థ్యాన్ని ఆమెగాని మొహంఎదుట మెచ్చుకోనవసరం లేదు. కాని ఆమె కట్టో, జుట్టో ఏ పద్ధతిలోనన్నా నాకు నచ్చకపోయినా, నేను తోచనప్పుడల్లా రాసి పత్రికలకు పంపించే కథలు ఆమెకు నచ్చకపోయినా మొహంఎదుటే అనవచ్చు. నిజంగా కోపం రానంతవరకూ ఒకరిమీదఒకరం కోప్పడ్డట్టు అభినయించవచ్చు. కోపం వచ్చిందని ఆరోపించనూవచ్చు. మా స్నేహానికి దమయంతి తల్లే సాక్షి.

“ఇది ఎట్లామారిపోయిందండీ! మీరు ఏం చెప్పినా చేస్తున్నదిగాని ఇంకెవరు చెప్పినా ఏ పనీచెయ్యదు. చుట్టాలతో కూడా నోరువిప్పి మాటలాడనిమనిషి మీతో ఎట్లా వాదంవేస్తుందో! మీకు కోపం వస్తుందేమోనని భయపడతాగాని దానికి కొంచెమన్నా భయం భక్తీ లేదే!” అని ఆవిడ ముక్కుమీంద వేలేసుకునేది.

“మీకు తెలీదా ఏం? దమయంతి నన్ను కాచి వడబోసింది. నా విషయం ఏమన్నా తెలుసుకోవాలంటే నేను మీ అమ్మాయినే అడిగి కనుక్కుంటూ ఉంటా!” అన్నాను.

"అమ్మో! ఎవరిమనసన్నా తెలుసుకోవచ్చుగాని, మీ బ్రాహ్మల మనస్సు కనుక్కోవటం కష్టం!" అన్నది దమయంతి.

పెద్దావిడ మళ్ళా ముక్కుమీద వేలేసుకున్నది. ఆవిడ కళ్ళు నా మొహానే ఉన్నాయి—ఎంతకోపం దాస్తున్నానో అని!...

ఒకనాడు ఆకస్మికంగా నాకుతట్టిందీ—నాకూ దమయంతికీగల ఆదర్శస్నేహాన్నిగూర్చి లోలోపల చాలాగర్విస్తున్నాననీ, ఆనందిస్తున్నాననీ ఆ ఆనందం నాలోకలిగే భావాలన్నిటిమీద ఒక సౌమ్యమైనకాంతిని వెదజల్లుతున్నదనీనూ! అవును. నేనెందుకు గర్వించకూడదు. ఈ స్నేహాన్ని నేనెంతో భద్రంగా పట్టుకొస్తున్నాను. దీనిపై ఒక్క ఈగ వాలకుండా, దీనికి గట్టిగా ఏగాలీసోకకుండా ఇది ఏ మాత్రము కందకుండా ప్రాణప్రదంగా పట్టుకొస్తున్నానుకానా! దీన్ని భగ్నంచెయ్యటానికి ఒక్క తొందరపాటు మాట, ఒక్క అభావచేష్ట, నిగ్రహాన్ని జయించిన ఒక్కచూపు సయితం చాలునే. నా స్థితిలో ఎంతమంది దీనిపట్ల ఇంతశ్రద్ధ కనబరుస్తారు! దమయంతి నా ఒక్కడిమొహమే ఎరుగునా! నా ఒక్కడితోనే మాటలాడిందా? అటువంటిది తన చనువు నా ఒక్కడికే ఎందుకిచ్చింది.

నేను దమయంతిని ప్రేమిస్తున్నానా అనిగాని దమయంతి నన్ను ప్రేమిస్తున్నదా అనిగాని నేను విమర్శించలేను! అది అనవసరం. మనస్సుల్లో భూతద్దాలుంటే ప్రతి మమకారాన్ని ప్రేమకింద పెంచి చూసుకోవచ్చు. మైదానంలాంటి

మనస్సులో కామమే అన్నివైపులా విస్తరించి ప్రేమలాగా కనిపిస్తుంది. నాకు కలిగిన తృప్తిఅల్లా ఏమంటే నాకు దమయంతిమీదగల భావం ప్రేమ కానిపక్షాన నాకీభావమే కావాలిగాని ప్రేమ అవసరంలేదు. ఈభావంనుంచి నేనిప్పుడు పొందే ఆనందంనుంచి నా కింకేమి అవసరంలేదు. నాకు సంతృప్తి ఎవతైనా ఇస్తుంది. సంసార జంజాటంకూడా ఇంచుమించు ఎవతెతోనైనా సాగించవచ్చు. కాని ఈ అన్యోన్యత జన్మలో ఎంతమందితో సాధ్యమవుతుందీ? అదైనా ఎంతమందికి సాధ్యమవుతుంది?

దమయంతి నన్ను ఆకర్షించలేదనికాదు. ఆమె మూలంగా నేను యమబాధ పడలేదనికాదు. కాని ఆ ఆకర్షణనూ, బాధనూ నేను తృణీకరించాను. దాన్ని నేను ప్రేమగా యెన్నడూ భ్రమపడలేదు. అది ప్రేమే అయితే అనేకమంది ఐహికవాంఛలు భగవద్భక్తి కావటానికి అడ్డేమిటి?

అదీగాక మా యిద్దరికీ మధ్యగల స్నేహంతో నా శారీరకవాంఛలను కలగలపాలంటే వున్నదల్లా ఒక టేమార్గం— నేనూ ఆమే పెళ్ళాడటం.

బ్రాహ్మడైన నేనూ, బ్రాహ్మణికాని ఆమె! ఎందుకా పెళ్ళి? ఆ పెళ్ళి జరగాలంటే యిద్దరమూ యెంత త్యాగానికి ఒడిగట్టాలి? ఎంతమందికి వెలికావాలి? ఎందుకు? ఎవరితోనైనా లభించే కామసంతృప్తికేనా?

ముక్కుసూటి ప్రశ్నలు. కాని వీటికి ముక్కుసూటి సమాధానాలెట్లా చెప్పటం? ఆమె నన్ను కాకుండా యింకొణ్ణి పెళ్ళాడి సుఖపడ్డట్టు వూహించగలిగానుగాని నే నింకొకతెను

పెళ్ళాడి సుఖపడ్డట్టూ ఊహించలేకపోయాను. ఏమిటి చెయ్యాటం? ఈ వున్న ఆనందాన్ని తోసుకుని ముందుకుపోయి—ఏ అగాధంలోనో పడటమే? అసంభవం! నావల్లకాదు. నేను గోడ చేసుకున్నాను. ఇక ముందుకు పోయేదారిలేదు.

పైగా దమయంతి బ్రాహ్మణ్ణి పెళ్ళాడదు. పెళ్ళాడరాదు. ఆ విషయంలో దమయంతి కెంతపంతంవుందో నాకు తెలీదుగాని నాకు చాలా పంతంవుంది! ఆ బ్రాహ్మణ్ణి నేను అయినాసరే నా యెక్కువేమిటి? నా ఆప్తులలో బ్రాహ్మలు లేరా? వాళ్ళకు బ్రాహ్మణేతరులపై వైషమ్యాలు లేవా? దమయంతిని పెళ్ళాడినందువల్ల నాకు ప్రపంచంలో వున్నంత సౌఖ్యమూ లభిస్తే యేంగాక? ఆమె నన్ను పెళ్ళాడి నా బంధువుల్లో కొందరికి ఆమె బంధువుకావటం భరించగలనా? వాళ్ళ కులవిద్వేషపుగాలి ఆమెకు యెంత స్వల్పంగా సోకినా సహించగలనా? నేను కులం విడిచేశాను. కాని కులం విడవనివాళ్ళ నందర్నీ విడవలేదు. అది సాధ్యమూకాదు. ఆమెకైనా అంతేగద!

ఒక్కసారిగా ఇంజనీరుగారి కుటుంబం పెద్ద సుడిగుండంలో పడింది. ఇంజనీరు మరదలు యెవరికీ తెలీకుండా పెళ్ళాడేసింది. అవతలవాడు బ్రాహ్మడు.

దమయంతి వదినెగారి యేడుపు నా చెవులపడింది సన్నగా.

“ఎందుకు చెయ్యాలి యిటువంటిపని? మేమంతా లేమా? మట్టిగొట్టుకు పోయామా? తనకు కావలిస్తే కొంద

మీాది కోతిని తీసుకురాలేకపోయామా? ఏంపని చేసింది. ఛీ ఛీ!" అని ఇంజనీరుగా రసటం విన్నాను.

"అందుకనే తెచ్చిన సంబంధాలల్లా వొద్దనేసిం దబ్బాయ్! ఈ సంబంధానికి యెవరూ ఒప్పరనే నాటుగా యీ పని చేసింది. అనుభవిస్తుందిలే. చూచుకో మూాడు నెలల్లోపల కుక్కల్లే తిరిగిరాకపోతే" అన్నది పెద్దావిడ.

అర్థంచేసుకోగలిగాను. వారి దృష్టినుంచి ఇంజనీరు మరదలు తన సమాజాన్ని కాలతన్నింది. తప్పే. వాళ్ళను కోవటం సబబే. ఎవరో ఆ బ్రాహ్మణయువకుడు, వాణ్ణి వీళ్లు తమ "అల్లుడు" కింద స్వీకరించలేరు. ఆ పిల్ల చచ్చిపోవటం యెటువంటిదో, వాణ్ణి చేసుకోవడంకూడా అటువంటిదే.

ఇందరిమాటలూ, విచారమూ అర్థం చేసుకోగలిగాను గాని దమయంతి మాటలు అర్థంచేసుకోలేకపోయాను. ఆ మాటలు నాలో కట్టుకున్న యే చిన్నగూటినో కాలతన్నే శాయి. నాలో ఆ యేదో కుప్పున కూలిపోయింది.

"కులమంటి కోతినయం! బ్రాహ్మడైతే యే మెక్కు వనుకుంది! ఆవిడ కాపాటిఅభిమానంవుండక్కల్లా? అభిమానం పోగొట్టుకుని యీా పెళ్ళితో యేం బావుకుందామనుకుందో? వాడు తన నెందుకు పెళ్ళి చేసుకుంటున్నాడనైనా ఆలో చించగూడదా? తనకే తెలిసేదిగా?" అన్నది దమయంతి.

నేను అంతదూరాన వున్నాను. దగ్గిరికివచ్చి దమ యంతికి సమాధానం చెప్ప బుద్ధిఅయింది. నాకెందు కను కున్నానుగాని. మనస్సు నిలవలేదు నిగ్రహం ఎందుకూ పనికి రాలేదు

"ఎట్లా చెప్పగలవు దమయంతీ! మీ బంధువురాలు ఆ దౌర్భాగ్యుడిలో ఏంచూసిందో? వాడికోసం ఎన్నాళ్లు తపించిందో? వాణ్ణి పోగొట్టుకోవటం వల్ల దక్కేవి ఆమెకెంత తుచ్ఛంగా కనిపించాయో! నువ్వు అభిమానం అనేది ఆమెకు మట్టితో సమంగా తోచిందేమో! మనకెన్నడూ కలగని భావాలు ఇతరులకు కలగటం సాధ్యంకావనుకోవటం పొరబాటుకాదూ?"

నా ఉద్రేకం తీసేసినట్టుగా జారిపోయింది. ఒళ్ళంతా చల్లబడ్డట్టయింది. అందరూ నాకేసి నివ్వెరపోయి చూస్తున్నారు. దమయంతి అందరికన్నా పెద్దకళ్ళుచేసి చూస్తున్నది-నా యదార్థస్వరూపం ఇప్పుడే తెలుసుకుంటున్నదానిలాగా.

గబగబా గదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నాను. ఊపిరి సరిగా ఆడటంలేదు. నాకేమైనా దయ్యంపట్టిందా? పిలవని పేరంటంగా వెళ్ళి ఎందుకు మాట్లాడాను? ఏమిటి నేను మాటలాడింది? నా మాటల కేమన్నా అర్థముందా? ఈ తలుపులు తెరుచుకుని మళ్ళీ వాళ్ళ మొహాల ఎదట పడగలనా? ఆ ఇద్దరూ ఎవరో ఎరగను. వాళ్ళను వెనకేసుకొచ్చింది. దమయంతితో ఆ అర్థంలేనిమాటలు అని నేను చేసినదేమిటి? ఇన్నాళ్ళబట్టీ ఎంతో భద్రంగా పట్టుకొస్తున్న మా ఆదర్శ స్నేహాన్ని ఏంచేశాను?

ఈ స్నేహంమాట జ్ఞాపకంరాగానే మళ్ళీ నాలో ఏదో అభిమానం తలఎత్తింది. నేనన్నదాన్లో తప్పేమిటి? ఇంకొకరి బ్రాహ్మణత్వం అడ్డం పెట్టుకుని ఆమె తన వదినె చెల్లెల్ని గురించి అంతచులకనగా ఎందుకు మాటలాడాలి? అతన్ని

గురించి వ్యక్తిగతంగా ఈ దమయంతిమాత్రమే మెరుగును! నేను బ్రాహ్మణ్ణికానా? ఆ దౌర్భాగ్యుడుమీద ఉన్న దురభిప్రాయం ఈ దమయంతికి నా మీదమాత్రం ఎందుకులేదు. ఉండే ఉండాలి. వాణ్ణిగురించి నేనువింటుండగా అన్నమాటలు నన్ను గురించి ఎందరి ఎదుట అన్నదో! ఈ మట్టికాళ్ళ పెద్దమ్మను ఏడాదిపాటు నా హృదయంలో పెట్టుకొని ఏమని అర్చించాను! ఈ మనిషిని అందలా లెక్కించి నా హృదయ వీధుల్లో ఏమనిఊరేగించాను. ఈమెకు బ్రాహ్మలమీంద విద్వేషం ఉండటం ధర్మమేనని నేనే ఒప్పుకున్నానుకద. కాని ఆ విద్వేషం వ్యక్తిగతంగా ఎరగని వాడిమీద ప్రయోగిస్తుందా—అవతల మరొకతె తనసాటిది వాడిని ప్రేమించి పెళ్ళాడిందని తెలిసికూడా! అటువంటి గుడ్డివిద్వేషాన్ని ఎట్లా సమర్థించటం!

నా ఆత్మాభిమానం తిరిగివచ్చింది. వీళ్ళనుచూసి నేనిక సిగ్గుపడను. చాతనయితే ఆ దమయంతే నన్ను చూడటానికి సిగ్గుపడనా? సిగ్గుపడదూ? పోనీ. అంత ఆత్మజ్ఞానంలేని మనిషిగురించి నా కెందుకొచ్చినచింత.

నేను దమయంతిని మళ్ళీ పలకరించలేదు. ఆమెకేసి చూడాలన్న కోరికకూడా పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది.

ఒకనాటి సాయంకాలం దమయంతి నా గదివాకిలి దగ్గిర వచ్చి నిలబడింది. గదిలోకూచుని చాకలి బట్టలుసర్దుకుంటూ ఆమెను గమనించనట్టు నటించాను.

"ఏమండీ కనిపించటంలేదు, పలకరించటంలేదు. పని తొందరలో ఉంటున్నారా?......లేక నామీదేమన్నా

కోపమా !'' ఆమె గొంతు నిశ్చలంగానూ గంభీరంగానూ ఉంది.

"ఎందుకు కోపం ?"

నిజంచెప్పండి, కోపం రాలా? ఆనాడు చాలా కోపం వచ్చే మాటలాడారు. మరి మాటలాడటంలేదు. ఎంతో చనువుగా వుంటున్నవారు కోపగస్తే నా కేమీ బాగాలేదు. మీరు నా మాటలు సరిగా అర్థంచేసుకోలేదేమో ? అసలు సంగతి చెబుదామని వచ్చాను... మీరు వింటానంటే."

"పిచ్చిదానా, నేనెవణ్ణి ? నాకు కోపంవస్తే నువ్వెం దుకు నన్ను సరిదిద్దాలి ?''

"వేరే యేమీ లేదు. మీరు పొరపాటుపడి నామీద కోపగించటం నాకు కష్టంగావుంది. నే చెప్పేది విన్నతరవాత కూడా మీకు కోపం పోకపోతే నా దురదృష్ట మనుకుంటా ననుకోండి.''

నే నామెకేసి చూస్తూ వూరుకున్నాను, చెప్పేదేమో చెప్పమనట్టుగా.

"మా అన్నమరదల్ని మీ రెరుగరు. నే నెరుగుదును. నా అందం మీ రెరుగుదురుగదా, నాకన్నా అనాకారి. దానికితోడు చాదస్తంమనిషి. ఆలోచించేశక్తి చాలదు. చాలా డబ్బుమటుకున్నది. ఆమెను యెవరూ ప్రేమించి చేసు కుంటారంటే నమ్మశక్యంకాదు. ఎవరన్నా చేసుకుంటే డబ్బు కోసం చేసుకోవాలి. వాళ్ళ బంధువులుకూడా, ఎవరన్నా

మంచివాడిని డబ్బుకే కొని కట్టబెడదామని వున్నారు. వాళ్ళకి తెలీకుండా యీ పెళ్ళి చేసుకుని వాళ్ళక్కూడా దూరమైపోయింది. ఆ అబ్బాయెవరో నే నెరుగను. అతను బ్రాహ్మడు కావటం యీపె అదృష్టమే కావచ్చు. అత డాపెను బాగా ప్రేమించే చేసుకుని వుండనూవచ్చు. కాని నేను నమ్మను. అటువంటివాడు చాటుగా చేసుకునివుండడు. అంతకంటె నే నేమీ అనలేదు... ఒప్పుకుంటాను. మీరు పక్కనే వున్నది మరచి కులవిషయం యెత్తటం నా తప్పే!"

నే నేమన్నా అంటానేమోనని ఒక్కనిమిషం ఆగి దమయంతి నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది.

నే నేమంటాను ? అనేటందు కేముందీ ? ఆమెతో నా సంబంధం గోడదాకా వచ్చిందని చెప్పనేచెప్పాను. ఆ గోడ కేసి డీకొట్టి గోడలో కంతపెట్టి అందులోనుంచి ఒక్కగంతు వేసి అవతలగల అగాధంలోకి పడిపోయాను. అదీ నేను చేసింది. మా ఇద్దరి స్నేహమూ ? నా చేతిలోనే దాన్ని వెయ్యి ముక్కలు చేసేసుకున్నాను. ఆ ముక్కలన్నీ హృదయంలో మూలమూలల గుచ్చుకుని హృదయం రక్తం కారుతూ ఉంది. ఇంకా కారుతూనే ఉంటుంది కూడాను.